# వాన చినుకులు

తడి బట్టలు ఆరవేయడానికి డాబా మీదకు వెళ్ళిన సుందరమ్మ యథాలాపంగా ఉత్తరం వైపు పెరట్లోని నిమ్మ చెట్టు వైపు చూసింది. సెలవు మీద ఇంటి కొచ్చిన కొడుకు రాజా, పనిపిల్ల నవనీతంతో సరసాలాడుతున్నాడు. నవనీతం జడ రాజా చేతుల్లో ఉంది. అది నవ్వుతూ, చిలిపి కళ్లతో రాజాని మరింత కవ్విస్తూంది.

సుందరమ్మ వెంటనే మేడ దిగి వంటింట్లోకి వెళ్లి, "నవనీతం!" అంటూ గట్టిగా అరిచింది. రెండు నిమిషాల తరువాత, "ఏంటండమ్మగోరూ" అంటూ నవనీతం వచ్చింది, పమిటతో తడి చేతులు తుడుచుకొంటూ, ఏమీ తెలియనిదానిలా. "ఎంత నంగనాచివే!" అనుకొంది సుందరమ్మ. "ఈ అంట్లు కూడా తీసుకుపో. తొందరగా పని తెములు్చ. చారు కాచడానికి గిన్నె లేదు" అంది కటువుగా. నవనీతం గిన్నెలు తీసుకొని పోయింది.

గిన్నెలు తీసుకుపోతున్న నవనీతం వైపు పరీక్షగా చూసింది సుందరమ్మ. రేగిన జుట్టు, మోకాళ్ళపైకి గోచీ పోసిన చీరకట్టు, నిగనిగలాడే నల్లని శరీరం, మంచి యౌవనంలో ఉన్న నవనీతం పడుచు కుర్రాళ్లని పిచ్చివాళ్లని చెయ్యడం సహజమే అనుకొంది.

పొయ్యి మీద పప్పుగిన్నె పడేసి, పొగ రాజుకొంటున్న పుల్లల్ని విసరసాగింది.

రాజాకి మట్టుకు బుద్ధి ఉండొద్దూ?

రాజా వాళ్లకి ఇద్దరాడపిల్లల తరవాత పుట్టడం వల్ల గారాబంగా పెరిగినా, చదువు పూర్తయి ఉద్యోగంలో చేరకమునుపు సుందరమ్మకూ, సీతారామయ్యకూ తెలిసినంత వరకూ ఇటువంటి వేషాలేమీ వెయ్యలేదు. అయితే పట్నంలో ఉద్యోగం చేస్తూ, నెలకు ఆరు వందలకి పైగా సంపాదిస్తున్న రాజా ఇప్పుడు పూర్తిగా స్వతంత్రుడు. ఆర్థికంగా ఏ విధమైన చిక్కులూ లేనివాళ్ళు కాబట్టి, ఇంటికి ఒక్క పైసా కూడా పంపవలసిన అవసరం లేదు కాబట్టి, ఆర్థికంగా కూడా స్వతంత్రుడు.

సుందరమ్మే ఒక రోజు భర్తతో అంది: "మనకవసరం లేదు కదా అని అంత డబ్బూ వాడి దగ్గరే ఉంచుకొనివ్వడం నాకేమీ నచ్చలేదు. ఓ రెండు మూడు వందలు నెల నెలా పంపమనండి. వాడి పేర బ్యాంకులో పడేయవచ్చు"

"బాధ్యత తెలిసినవాడు రాజా. లేకపోతే చక్కగా చదువుకొని, చిన్న వయసులోనే అంత ఉద్యోగం సంపాదించినవాడెవడే! అయినా, సంపాదనపరుడైన కొడుకుని జమా ఖర్చులడగడం నా వల్ల కాదు. పైగా, వాడొక కానీ నిలవ చెయ్యకపోయినాఫర్వాలేదు" అని తోసి పారేశాడు సీతారామయ్య, తను వ్యవసాయం చేసి సంపాదించిన పాతికెకరాల మాగాణి భూమిని తలుచుకొంటూ.

అయితే ఆ రోజు, ఆర్థిక స్వాతంత్ర్యం వల్ల విలాసాలకూ, వ్యసనాలకూ బానిసలయ్యే ప్రమాదం ఉందని సుందరమ్మ కాని, సీతారామయ్య కాని తీవ్రంగా ఆలోచించలేదు.

ఉద్యోగంలో చేరిన ఏణ్ణర్థం తరవాత, మొదటిసారిగా నెల రోజులు సెలవు పెట్టి ఇంటికొచ్చిన రాజాని చూసి మురిసిపోయింది. రాజా కిష్టమైన పిండి వంటలూ అవీ చేసి మొదటి నాలుగురోజులూ తెగ హంగామా చేసింది. అయితే సుందరమ్మలోని ఉత్సాహమంతా నిమ్మచెట్టు కింది ఆ దృశ్యం చూసిన తర్వాత ఒక్కసారిగా చచ్చిపోయి, చెప్పరాని దిగులు పట్టుకొంది. ఎంతో మంచివాడనుకొన్న రాజా ఇంత దిగజారిపోతాడని కలలలో కూడా ఊహించని సుందరమ్మ, ఎంతగానో బాధపడసాగింది.

అసలు దీనికంతటికీ కారణం, నవనీతం తల్లి చంద్రమ్మ మంచాన పడడం. చంద్రమ్మ మంచం మీద నుంచి లేవలేకపోవడం వల్ల నవనీతం పని చెయ్యడానికి రావడం మొదలుపెట్టింది. 'సరిగా రాజా వచ్చే సమయానికే దీని తల్లి మంచాన పడాలా' అనుకొంది సుందరమ్మ.

'నవనీతం తన జాణతనం, టక్కులు చూపి రాజాని బుట్టలో వేసుకో చూస్తుంది. ఇందులో రాజాదేం తప్పు? దీన్నివేళ పనిలోంచి తీసి పారెయ్యాలి. అయితే ఏ వంక పెట్టి తీసెయ్యడం? ఎంతటి మసిబారిన గిన్నెలు పడేసినా, తళ తళ మెరిసిపోయేటట్లు శుభ్రంగా తోమే చంద్రమ్మని కాని, నవనీతాన్ని కాని ఎలా పనిలోంచి తీసివేయడం? పైగా, యజమానుల్ని పల్లెత్తు మాట అనరు. చేతివాటుతనమనేది ఎరగరు. అటువంటి తల్లీ

కూతుళ్లని ఏ కారణం చూపి మానిపించడం? పోనీ, నీ కూతురిలా చేసిందని చంద్రమ్మతో చెపితే? అభిమానం కొద్దీ అది మటుకు ఊరుకొంటుందా ఏమిటి? తగవుకు దిగితే, నలుగురిలోనూ నీ కొడుకు బుద్ధి ఏమయిందని ప్రశ్నించదూ?

ఒకవేళ ధైర్యం చేసి ఏదో అవసరం లేదని వంక పెట్టి మానిపించినా, రాజా బుద్ధి మారుతుందేమిటి? ఇంట్లో కాకుండా పై ప్రదేశంలో కలుసుకోకూడదని ఏముంది? అయినా ఇంట్లోనే ఇంత ధైర్యం చేసిన రాజా పట్నంలో ఏం వెలిగిస్తున్నాడో!' - ఈ ఆలోచన రాగానే సుందరమ్మ హడలిపోయింది.

సుందరమ్మకి హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది. ఆర్నెల్ల క్రితం పండగలకి అల్లుళ్ళిద్దరూ వచ్చారు. రాజాని కూడా రమ్మని ఉత్తరం రాస్తే, మొదటి సంవత్సరం కాబట్టి సెలవు తీసుకోవడం బాగుండదని, రావడానికి వీలుండదని ఉత్తరం వ్రాస్తూ, అక్కలిద్దరికీ మంచి ఖరీదు చేసే రెండు చీరలూ, జాకెట్టు గుడ్డలూ పార్శెలు చేసి పంపాడు రాజా.

కూతుళ్ళిద్దరూ, 'మంచి చీర, చీరలకి మాచ్ అయ్యే గుడ్డలు పంపించాడు. రాజాకింత చక్కగా బట్టలు ఎన్నడం ఎలా వచ్చిం'దని విస్తుపోయారు. దానికి సమాధానం సుందరమ్మ కిప్పుడు దొరికింది. 'ఆ చీరల ఎన్నికలో ఎవరో ఆడదాని ప్రమేయం ఉండి తీరాలి! అసలప్పుడే గ్రహించవలసింది. అందరివీ మట్టి బుర్రలు - ఒక్కళ్ళకీ తట్టనేలేదు!

'ఇక్కడ నవనీతాన్నీ మానిపించి, ఈ నెల రోజులూ రాజాని అదుపులో పెట్టినా పట్నం వెళ్ళిన తర్వాత ఎవరు పట్టుకోగలరు?' సుందరమ్మకేమీ తోచలేదు.

బాధ కొద్దీ చేతిలోని విసనకర్ర విసిరి పారేసింది. అది వెళ్లి పక్కనే ఉన్న పాలగిన్నెకి తగిలి, పాలన్నీ ఒలికిపోయాయి. పాలు ఒలికిన నేలని, నీళ్లతో శుభ్రం చేస్తున్నప్పుడు సుందరమ్మకిలా తట్టింది: 'రాజాకి పెళ్లి చేసేస్తే ఏ గొడవా ఉండదు. లేకపోతే ఒంట్లో ఉడుకు నెత్తురు ఉన్నంతసేపూ వయస్సులో ఉన్న వాళ్లు వికారాలకి లోనుకావడం తప్పదు!' సుందరమ్మకేదో బరువు దింపినట్లయిపోయింది.

భోజనాలు చేస్తున్నంతసేపూ సీతారామయ్య ఏవో పొలం విషయాలు చెపుతూనే ఉన్నాడు. రాజా అన్నింటికీ ఊ కొడుతూ అన్యమనస్కంగా అన్నం తింటున్నాడు. తను నవనీతంతో సరాగాలాడటం తల్లి చూసిందేమోనన్న అనుమానం పీడించసాగింది. సుందరమ్మ కూడా వడ్డన చేస్తున్నప్పుడు - 'వీడిదివరకు లాగ కుర్రవెధవ కాడు. ముందు ముందు వీడికి కన్నతల్లి ప్రేమ అవసరమే ఉండదు' అనుకొంది. సుందరమ్మకు తన మీదే జాలి పుట్టుకొచ్చింది. పెరుగు గిన్నె పూర్తిగా రాజా కంచంలోకి ఒంపేసింది.

సీతారామయ్య నవ్వుతూ అన్నాడు: "ఏమేవ్! నా సంగతి మరిచిపోయినట్లున్నావ్! ఇక్కడున్న నెల రోజులూ గిన్నెడేసి పెరుగు తింటే, రేపు వాడికి మళ్లీ హోటల్ భోజనం కష్టమై పోతుంది."

"వాడికి హోటల్ భోజనం అవసరం ఉండదు!" అంది సుందరమ్మ, అదే అదనన్నట్లుగా.

"ఏమిటీ, ఉద్యోగం మానిపించేస్తావా? సరే, పదవోయ్-ఈరోజునుంచీ పొలానికి" అన్నాడు సీతారామయ్య విరగబడి నవ్వుతూ.

'ఈయనకేమీ అర్థం కాదు!' అని లోలోపల విసుక్కొంది సుందరమ్మ. కొడుకు ముందు వివరంగా మాట్లాడడానికి వీల్లేక ఊరుకొంది.

ఆ రోజు రాత్రి డాబా మీద ఆరు బయట వెన్నెలలో మంచం మీద పడుకొన్న సీతారామయ్య కాళ్ల దగ్గర కూర్చుని సుందరమ్మ రాజా పెళ్లి విషయం ఎత్తింది.

"వాడింకా రెండేళ్లు ఉద్యోగం చేస్తే బాగుంటుంది. అప్పటికి పాతికేళ్లూ నిండుతాయి. ఈలోపుగా ఉద్యోగంలో కూడా బాగా స్థిరపడతాడు. ఇప్పటి నుంచీ పెళ్లీ పెటాకులూ అంటే, ఉద్యోగం నట్టుబడిపోతుంది" అన్నాడు సీతారామయ్య సాలోచనగా.

సుందరమ్మ కొక్కసారిగా కోపం ముంచుకొచ్చింది. "మీరలా అంటూ ఊరుకోండి. వీడీలోపుగా కొంప ముంచుతాడు! తరువాత ఈ ఊళ్లో తలెత్తుకు తిరగలేం. ఆ పైన మీ ఇష్టం" అంది నిష్ఠూరంగా.

ఇలా ఒక్కసారిగా ధోరణి మారడంతో సీతారామయ్య కొద్దిగా కంగారుపడ్డాడు. లేచి కూర్చుంటూ, "ఏమిటీ నువ్వనేది?" అని అడిగాడు.

"అదే, ఏ నవనీతమో వాడి కాళ్లకు బంధం వేస్తుంది. ఈ వేళ ఉదయం నిమ్మ చెట్టు కింద....." అంటూ సుందరమ్మ తను చూసిన విషయాన్ని వివరంగా మొగుడికి చెప్పింది. అంతా విన్నతరవాత "నవనీతం అంత గ్రంథసాంగురాలయిందా?" అన్నాడు సీతారామయ్య.

"దాన్నని ప్రయోజనం ఏముంది - మన బంగారం మంచిది కానప్పుడు! ఇక్కడ ఇది కాకపోయినా, ఓసారి బుద్ధంటూ పుట్టిన తరువాత అక్కడ పట్నంలో ఏం చేస్తాడో? ఏమైనా సరే, వాడు తిరిగి వెళ్లేలోగా పెళ్లి చేసి తీరందే ఒప్పుకోను", అంది సుందరమ్మ తన నిశ్చయానికి తిరుగు లేదన్నట్లుగా.

"ఉన్న ఈ కాస్త సెలవులోనూ పెళ్ళంటే మాటలా? అయినా, మీ అన్నయ్య కూతురంటే రాజాకి ఇష్టమో, కాదో? రంగంటే తెలుపు కాని..." ఇంకా ఏదో అనబోతున్న సీతారామయ్యని మధ్యలో ఆపి సుందరమ్మ హేళనగా అంది: "అయితే ఆ నల్ల నవనీతాన్ని కోడలుగా చేసుకోండి. అంతేకాని, సరోజనేమన్నా ఒప్పుకోను. దానికేం? లక్షణమైన పిల్ల"

సీతారామయ్య మాట మారుస్తూ అన్నాడు: "ఎంత దగ్గర సంబంధమైనా నేను మగ పిల్లవాడి తండ్రిని కదా- మీ అన్నయ్యకెలా ఉత్తరం రాస్తానే?"

"అలా దారికి రండి. మీరు చేయవలసిందల్లా - రేపు ఉదయమే రాజాని పొలం వైపు తీసుకుపోయి అన్ని విషయాలూ మాట్లాడండి. మిగిలిన ఏర్పాట్లు నే చూసు కొంటాను" అంది సుందరమ్మ ఉత్సాహాన్ని పుంజుకొంటూ.

తన పని తీరినట్లుగా లేచి పోబోయిన సుందరమ్మని చేయి పట్టుకు మీదకు లాక్కొన్నాడు సీతారామయ్య.

"ఇన్నేళ్ళొచ్చి ఏమిటీ సరసాలు?" అంది సుందరమ్మ చిరు కోపం ప్రకటిస్తూ.

"అలా చూడు - చక్కటి చంద్రుడు; చిక్కటి వెన్నెల...." సీతారామయ్య మరి మాట్లాడలేకపోయాడు.

రాజా ఏ కళనున్నాడో, పెళ్లి అనగానే 'ఊఁ' అన్నాడు.

సుందరమ్మ ఆనందానికి హద్దు లేకపోయింది. మనిషిని పంపి అన్నగారిని రాత్రి కల్లా రప్పించింది. అన్నా చెల్లెల్లిద్దరూ ఆ రాత్రంతా నిద్రపోలేదు. ఇద్దరూ కలిసి అన్ని ఏర్పాట్లూ మాట్లాడుకొన్నారు. ఉదయమే పురోహితుడు వచ్చి పది రోజులలోపుగానే ముహూర్తం పెట్టేశాడు.

సుందరమ్మ పొలంలోని పాలేర్లు, కమతగాళ్ల సహాయంతో అన్ని పనులూ దగ్గరుండి చకచకా చేయించింది. కూతుళ్లని, అల్లుళ్లని టెలిగ్రాములిచ్చి పిలిపించింది. దగ్గర దగ్గర ఊళ్లలో ఉన్న అయినవాళ్లనందర్నీ సీతారామయ్య స్వయంగా వెళ్లి పిలిచాడు. పెళ్లి విందుకు కావలసిన అప్పడాలూ అవీ ఒత్తడానికి నవనీతాన్ని కూడా ఉపయోగించుకొంది సుందరమ్మ. ఇద్దరు కూతుళ్ల వివాహాలకి కూడా ఇంతగా శ్రమపడని సుందరమ్మని చూసి సీతారామయ్య ఆశ్చర్యపడకపోలేదు.

ఎలాగయితేనేం, సుందరమ్మ పట్టుదల వల్లా, పడిన శ్రమ వల్లా రాజా పెళ్లి అనుకొన్న ముహూర్తానికి సక్రమంగా జరిగిపోయింది. వచ్చిన బంధువులందరూ వెళ్లిపోయిన తరువాత కొడుకు కాపరానికి కావలసినవల్లా సిద్ధం చెయ్యడానికి ఉపక్రమించింది.

సెలవు అయిన తర్వాత రాజా పట్నం వెళ్లి కొత్త పెళ్ళాంతో కాపరం పెట్టేశాడు.

సుందరమ్మ సంతృప్తిగా ఒక్క దీర్ఘనిశ్వాసం విడిచింది, కొడుకు జీవితంలో స్థిర పడినందుకు.

రాజా వెళ్ళిపోయిన తరువాతి మొదటి శుక్రవారం రోజు మధ్యాహ్నం రెండింటికి గుళ్లో పురాణం వినడానికి వెళ్లింది సుందరమ్మ. నాలుగింటికల్లా పురాణం అయిపోయింది. మబ్బుగా ఉండి గాలి వీచసాగింది. డాబా మీద ఆరేసిన బట్టలు తడిసిపోతాయేమోనన్న భయం కొద్దీ సుందరమ్మ త్వరగా ఇల్లు చేరుకొని, తిన్నగా డాబా మీదకు వెళ్లింది. తాడు మీద వేసిన బట్టలు తీస్తూ, పెరట వైపు చూసి కొయ్యబారిపోయింది. నిమ్మచెట్టు క్రింద చట్టుబండ మీద కూర్చుని ఉన్న సీతారామయ్య చేతిలో నవనీతం జారిపోయిన పమిట ఉంది! నవనీతం సీతారామయ్య మీదకు వంగి, చేతినున్న అంట్ల మసి బుగ్గలకు రాస్తోంది, చిలిపిగా నవ్వుతూ. అదే చందనంలా, మంచి గంధంలా ఊహిస్తూ పరవశించి పోయి, నవనీతం పెదాలందుకొన్నాడు సీతారామయ్య.

వాన చినుకుల పడి బట్టలు తడుస్తున్నాయి.

'మబ్బులొచ్చినప్పుడే జాగ్రత్త పడాలి. లేకపోతే వాన చినుకులు ఎండిన బట్టలను కూడా తడిపేస్తాయి' అనుకొంది సుందరమ్మ దిగాలుగా. - ఆ రోజు వెన్నెల రాత్రి సీతారామయ్య తనని దగ్గరగా తీసుకొన్న సంఘటనని తలచుకొంటూ. ●

(ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రిక : 17-11-1971)